క్లుప్తంగా

హనుమంతుడికి విశేష అలంకరణ


స్వామివారికి పూజలు చేస్తున్న వరికూటి

సింగరాయకొండ: హనుమత్ జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పాకల రైల్వేగేట్ సమీపంలోని ఆంజనేయ నగర్‌లో స్వామివారిని తులసీదళాలు, పట్టుదారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తమలపాకులతో అభిషేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారిని వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వైఎస్సార్ బీమా పథకం వరం


బీమా నగదును అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: వైఎస్సార్ బీమా పథకం పేదల పాలిట వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులోని అర్బన్ కాలనీలో మృతి చెందిన జుటికే శాంతమ్మ కుటుంబ సభ్యులకు రూ.10వేల బీమా నగదును గురువారం చైర్మన్ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి మురళీ, వెల్ఫేర్ సెక్రటరీ వాసుబాబు, స్థానిక నాయకులు ప్రసాద్‌రెడ్డి, గంట పీటర్, ప్రమోద్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కట్టడాలు ఆపాలని నిరసన


నిరసన తెలుపుతున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు, గ్రామస్తులు

కనిగిరి రూరల్: స్థానిక గార్లపేట బస్టాండ్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ ప్రదేశంలో విగ్రహాల పేరుతో నిర్మాణాలు చేపట్టడాన్ని ఆపాలని వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ మూలె ఏడుకొండలు, సర్పంచ్‌లు దానం నాగేంద్రారెడ్డి, అంకిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గార్లపేట బస్టాండ్ సెంటర్‌లో నాయకులు, పలు గ్రామాల ప్రజలు నిరసన తెలిపారు. సుమారు 15 గ్రామాల ప్రజలకు ఉపయోగ పడే ప్రదేశంలో అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణం కట్టడాన్ని ఆపాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ రకు ఆర్‌అండ్‌బీ డీఈకి వినతి పత్రం అందచేశారు.

వైఎస్సార్ కల్యాణమస్తు నలుగురికి మంజూరు

హనుమంతునిపాడు: వైఎస్సార్ కల్యాణమస్తు మండలంలో నలుగురికి మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ తెలిపారు. లబ్ధిదారులు ఒక్కొక్కరికి రూ.లక్ష వంతున బ్యాంకు ఖాతాలో జమైనట్లు పేర్కొన్నారు.

నర్సరీ పరిశీలన

కనిగిరి రూరల్: మండలంలోని చాకిరాలలో జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో ప్రొటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నర్సరీని గురువారం నాబార్డ్ డీడీఎం రవి పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు.

అక్రమ మద్యం స్వాధీనం

పొన్నలూరు: మండలంలోని శింగరబొట్ల పాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై దాసరి రాజారావు తెలిపారు. నిందితుడి నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయ్

- పెరిగిన లోడ్‌లతో పేలుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఎగిరిపోతున్న ఫీజులు
- పట్టణంలో విపరీతంగా పెరిగిన విద్యుత్ వాడకం
- రోజుకు లక్ష యూనిట్ల వరకు వాడకం, పెరిగిన ఏసీలు, కూలర్ల వినియోగం
- అధిక లోడ్‌తో రోజుకు 10–15 వరకు ట్రాన్స్‌ఫార్మర్, ఫీజు సమస్యలు


పట్టణంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్


మరమ్మతులు చేసే పనిలో విద్యుత్‌శాఖ ఏఈ, సిబ్బంది

కందుకూరు: రికార్డు స్థాయిలో నమోదవుతున్న వేసవి ఉష్ణోగ్రతల ధాటికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సీమ టపాకాయల పేలుతున్నాయి. ఎండల నుంచి ఉపశమనం కోసం జనాలు విద్యుత్ వాడకాన్ని అమాంతం పెంచేశారు. దీంతో సామర్థ్యాన్ని మించి అధిక లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లపై పడడంతో ఒక్కసారిగా కుప్పకూలుతున్నాయి. ఫీజులు ఎగిరిపోవడం, కండక్టర్ వైర్ల సమస్యలు ఇలా ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారులకు చేతినిండా పని కల్పిస్తున్నాయి. గత వారం రోజులుగా పట్టణంలో ఈ సమస్య అధికమైంది. అయినా విద్యుత్‌శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరిస్తూ జనాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

పెరిగిన విద్యుత్ వాడకం

ప్రస్తుతం పట్టణంలో 21వేల వరకు అన్ని రకాల విద్యుత్ సర్వీసులున్నాయి. వీటి పరిధిలో వేసవికి ముందు 75 వేల నుంచి 80వేల యూనిట్ల విద్యుత్ వాడకం ఉంటే ప్రస్తుతం ఇది లక్ష యూనిట్లకు చేరింది. ఇది భవిష్యత్‌లో లక్షా ఇరవై వేల యూనిట్ల వరకు పెరగవచ్చునని విద్యుత్‌శాఖ అధికారుల అంచనా. ప్రధానంగా గత పది రోజుల నుంచి ఈ వాడకం విపరీతంగా పెరిగింది. దీంతో ఆయా ఏరియాల్లో విద్యుత్ సరఫరా హెచ్చు, తగ్గులను నియంత్రించే ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రభావం పడుతుంది. వాటి సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగం పెరుగుతుండడంతో అధిక లోడ్ వాటిపై పడుతుంది. దీంతో ఒక్కసారి ట్రాన్స్‌ఫార్మర్‌లు పేలిపోతున్నాయి. వీటితో పాటు ఫీజు బాక్స్‌లు, కండక్టర్ వైర్ జంక్షన్‌ల వద్ద మంటలు వచ్చి మాడిపోతున్నాయి. ఇలాంటి సమస్యలు గత 10 రోజులుగా ఎక్కువగా నమోదవుతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారుల లెక్కల ప్రకారం రోజుకు 10–15 వరకు ఇటువంటి సమస్యలు వస్తే వాటిలో 5 ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయినవే ఉంటున్నాయి. దీంతో ఉన్నపళంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ఇటీవల కాలంలో చేతినిండా పనిపడుతుంది. ఎప్పుడు ఏ ట్రాన్స్‌ఫార్మర్ పేలుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అయినా పట్టణంలో సమస్య రాకుండా చర్యలు తీసుకోవడంలో విద్యుత్‌శాఖ అధికారులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచుకోవడంతో, సమస్య వచ్చిన వెంటనే స్పందించి వీలైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నారు.

ఆ సమయాల్లో విపరీత వాడకం...

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిలో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో పగటి వాతావరణం నిప్పుల కుంపటలా తయారవుతుంది. ఉదయం 8 గంటల నుంచే ప్రారంభమవుతున్న ఎండల తీవ్రత సాయం నాలుగు గంటలైనా తగ్గే పరిస్థితి లేదు. దీనికి తోడు భరించలేని ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు. ఇటువంటి వాతావరణం నుంచి ఉపశమనం పొందేందుకు జనాలు ఏసీలు, కూలర్లు వంటి విద్యుత్ పరికరాలను ఆశ్రయిస్తున్నారు. పట్టణంలో ఏసీల వాడకం అధికంగా పెరిగింది. ప్రధానంగా రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట మధ్యలో అధిక వినియోగం నమోదవుతుందని విద్యుత్‌శాఖ అధికారులు గుర్తించారు. దీనికి కారణం ఏసీ వాడకమేనని దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడుతుందని చెప్పన్నారు. ఒక్కసారి పెరిగిన అధిక లోడ్ సమస్యలతోనే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని అధికారులు చెప్తున్నారు.

ఏసీలు, కూలర్లకు డిమాండ్

మే నెల ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుండడంతో ఏసీలు, కూలర్లు వంటి వాటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఉక్కపోతను తట్టుకోలేక వీటిని కొనుగోలు చేసేందుకు జనాలు మొగ్గు చూపుతున్నారు. దీంతో వీటి విక్రయాలు కూడా పెరిగాయని వ్యాపారులు చెప్తున్నారు. మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా కూలర్లు కొనుగోలు చేస్తున్నారు. ఇవి లేకపోతే ప్రస్తుతం ఇళ్లలో ఉండే పరిస్థితి లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

> **సమస్య వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాం**
>
> పట్టణంలో విద్యుత్ వాడకం విపరీతంగా పెరిగింది. దీని వల్ల రోజుకు 15 వరకు విద్యుత్ సమస్యలు వస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలడం, కాలిపోవడం, ఫీజుల సమస్యలు వంటి సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. అయినా మా సిబ్బందితో ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరిస్తున్నాం. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏసీ వాడకం వల్లే ట్రాన్స్‌ఫార్మర్‌లపై అధిక లోడ్ పడుతుంది.
>
> – మధుబాబు, విద్యుత్‌శాఖ ఏఈ

పేదల భవిష్యత్‌కు ఢోకా లేదు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం
- వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


పెట్లూరులో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు

కొండపి(సింగరాయకొండ): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలను అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. కొండపి మండలం పెట్లూరు పంచాయతీలో గురువారం రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అందని కుటుంబాలను గుర్తించి వారికి పథకాలు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. వాస్తవానికి చాలా తక్కువ మందికి సాంకేతిక కారణాలతో పథకాలు అందలేదని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు అర్హత ఉన్నా, లేకపోయినా వారి ఇష్టప్రకారం పథకాలు అందించారని, అర్హులైన పేదలను గాలికి వదిలేసి ధనవంతులకు లబ్ధి చేకూర్చారని విమర్శించారు. కానీ ఇప్పుడేమో చంద్రబాబు ప్రతి పేదవానిని కోటీశ్వరుడిని చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం పేదల భవిష్యత్‌కు ఢోకా లేదని, జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. గతంలో ఎన్నికల సమయంలో తప్ప గడప గడపకు మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. గడప గడపలో సమస్యలను చెప్పాలని తాము ప్రజలను కోరుతుంటే టీడీపీ నేతలు మాత్రం వైఎస్సార్ సీపీ నాయకులను ప్రజలు అడ్డుకుంటున్నారని, నిలదీస్తున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదల మరుగుదొడ్ల బిల్లులు స్వాహా చేసిన ఘనత ఎమ్మెల్యే స్వామికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎ.కోటిరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు హరిబాబు, చిన్నప్పరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సీహెచ్ బ్రహ్మారెడ్డి, వేముల శ్రీనివాసరావు, ఇంటూరి రమణయ్య, వేముల రమేష్, కొల్లూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంగాభవానీ తిరునాళ్ల


గంగాభవానీ, బొల్లావుల మూలవిగ్రహమూర్తులు


ఆలయం వద్ద బండ్లు, భక్తుల సందడి

పామూరు: మండలంలోని మోపాడు గ్రామ సమీపంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద ఉన్న గంగాదేవి ఆలయంలో 5 రోజుల నుంచి జరుగుతున్న గంగాభవానీ తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా ముగిసింది. తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య పలువురు నాయకులు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పొంగించిన పొంగళ్లను గంగాభవానీ మాతకు నైవేద్యంగా సమర్పించారు. వివిధ గ్రామాలనుండి ఆలయంవద్దకు ప్రత్యేక అలంకరణతో తరలివచ్చిన ట్రాక్టర్లు భక్తులకు కనువిందుచేశాయి.

అనంతరం ఆలయ సమీపంలో ఎడ్లపందేలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరి రామిరెడ్డి, సర్పంచ్ చప్పిటి వరలక్ష్మి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, చప్పిడి అజయ్, ఖాదర్‌బాషా, రామసుబ్బారెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

కందుకూరు రూరల్: మండల పరిధిలోని మాచవరంలోని సచివాలయాన్ని ఎంపీడీఓ విజయశేఖర్ గురువారం తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను, రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యాలయానికి వచ్చిన సర్వీసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు సమయ పాలన పాటించాలన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయశేఖర్

వడగాడ్పులతో అప్రమత్తంగా ఉండండి


సింగరాయకొండ: వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సింగరాయకొండ: అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌ఆలీ సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-3 పరిధిలోని బైరాగిమాన్యం, బుంగబావి సెంటర్‌లో గురువారం వడదెబ్బ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వడదెబ్బ తగిలిన రోగి శరీరం అధిక ఉష్ణోగ్రతతో ఉంటుందని, ఒంటికి చెమట పట్టదన్నారు. ఇటువంటి లక్షణాలు ఉన్నప్పుడు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని, లేకపోతే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందన్నారు. అధిక ఉష్ణోగ్రత నుంచి రక్షించుకోవాలంటే ముఖ్యంగా నీడపట్టున ఉండాలని, మంచి నీరు, కొబ్బరిబొండాలు, ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం కలిపిన నీరు తాగాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది రాఘవేంద్రరావు, పంచాయతీ కార్యదర్శి సుశీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బ మృతులకు ప్రభుత్వ పరిహారం

టంగుటూరు: తీవ్రమైన వేడి గాలుల ప్రభావంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడే ప్రమాదం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే అతని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. ఎండ తీవ్రతతో మరణించిన వ్యక్తి దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలని, అలాగే కుటుంబ సభ్యులు వెంటనే పోలీసు శాఖ నుంచి ఎఫ్ఐఆర్ పొందాలని, అంత్యక్రియలు ముగియక ముందే త్రిసభ్య కమిటీకి మృతుడి వివరాలు తెలియజేయాలని స్పష్టం చేశారు.

నాడు-నేడు పనుల పరిశీలన


మోచర్లలో పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ

గుడ్లూరు: మండలంలోని మోచర్ల ఎంపీపీఎస్ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంఈఓ ప్రసాదరావు గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. పనుల వివరాలను ఫీల్డు ఇంజినీర్ వేణుగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో రూ.34 లక్షల ప్రతిపాదనలతో నాడు-నేడు రెండో దశ కింద కాంపౌండ్‌వాల్, అదనపు తరగతి గది, టాయిలెట్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసి పాఠశాల తెరిచేనాటికి పూర్తయ్యేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు. పనుల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయన వెంట ఇంజినీర్ వేణుగోపాల్, సీఆర్పీ సుభాని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుమతిలు ఉన్నారు. అలాగే తెట్టు, రావూరు పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపీడీఓ చంద్రసేన్ పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌ఓ వెంకటసుబ్బయ్య

సీఎస్‌పురం(పీసీపల్లి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ డీఆర్‌ఓ ఏ వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని సి.నాగులవరం, కంభంపాడు గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు, ఉపాధి కూలీలతో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వేసవిలో నీటిని పొదుపుగా వాడాలని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగం వల్ల పర్యావరణం దెబ్బ తింటుందనీ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నివారించాలని సూచించారు. చింతపూడి సర్పంచ్ ముప్పాళ్ల వసంతరాజు, ఉపాధ్యాయుడు వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు మేకల వీరాంజనేయులు, కుర్రా వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా చెట్టుమహాలక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేకాలంకరణలో చెట్టుమహాలక్ష్మమ్మ


కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానం 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విశేష పూజలు చేశారు. లక్ష్మీనారాయణులకు తిరుమంజనం, మంగళస్నాన ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం పుష్పయాగం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

108 మంది మహిళలు తలంబ్రాల బియ్యంతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రాత్రి లక్ష్మీనారాయణుల కళ్యాణోత్సవం కనుల పండుగగా సాగింది.

డీసీపీ పవన్‌కుమార్‌రెడ్డికి సన్మానం


డీసీపీ పవన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు, ప్రముఖులు

కనిగిరి రూరల్: చెన్నై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) అల్లాటిపల్లి పవన్‌కుమార్‌రెడ్డిని గురువారం రాత్రి పలువురు వైద్యులు, స్థానిక ప్రముఖులు ఘనంగా సన్మానించారు. మండలంలోని పునుగోడుకు చెందిన పవన్ కుమార్ రెడ్డి (ఐపీఎస్ అధికారి) ఉన్నత స్థాయి హోదాలో ఉండి కనిగిరికి వచ్చిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను కలిశారు. అనంతరం శ్రీ హర్షిత మల్లి స్పెషాలిటీ ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ రోగులకు పండ్లు, రొట్టెలను పవన్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందచేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు అల్లాటిపల్లి నారాయణరెడ్డి, వైద్యులు ఆవుల కృష్ణారెడ్డి, ఆవుల శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గుడ్లూరు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ సకాలంలో సచివాలయాలకు చేరుకోవాలని ఎంపీడీఓ చంద్రసేన్ పేర్కొన్నారు. మండలంలోని చేవూరు, రావూరు, సాలిపేట, మోచర్ల గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ గురువారం తనిఖీ చేశారు. నాలుగు సచివాలయాల్లో రికార్డులు, రిజిష్టర్లు, బయోమెట్రిక్ హాజరు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల చార్టులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా సిబ్బంది కృషి చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి


హనుమంతునిపాడు సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ కోటిరెడ్డి

కనిగిరి రూరల్: జగనన్న లే అవుట్ల ఇళ్ల నిర్మాణాలను అర్హులైన లబ్ధిదారులంతా త్వరితగతిన ప్రారంభించుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 7వ సచివాలయం కాశిరెడ్డి కాలనీలో గురువారం ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ 'నవరత్నాలు పేదలందరికి ఇళ్లు' కార్యక్రమంలో ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని తెలిపారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలన్నారు.

నిర్మాణాల్లో సమస్యలుంటే క్షేత్ర, మున్సిపల్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వివిధ దశల్లో ఆగిన ఇంటి నిర్మాణ లబ్ధిదారులతో క్లస్టర్ వారీగా ముఖాముఖిగా మాట్లాడి.. పనులు ప్రారంభించక పోవడానికి కారణాలు తెలుసుకున్నారు. ఆర్థికపరంగా ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకు పొదుపు గ్రూపుల ద్వారా అదనంగా రూ.35 వేలు పావలా వడ్డీకే అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామనాథం, మెప్మాటీ ఎంసీ రఘు, కౌన్సిలర్ పోతిరెడ్డి రాజారెడ్డి, సచివాలయ అడ్మిన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ కోటిరెడ్డి, ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, సర్పంచులు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద మండలానికి 532 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటి వరకు 96 ఇళ్లు మాత్రమే పనులు జరుగుతున్నాయన్నారు. పనులు వేగవంతంగా జరిగేటట్లు చూడాలన్నారు. 102 మంది లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ ఎస్.హరిబాబు, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సాని కొమ్ము మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ కత్తి రాజారావు, హౌసింగ్ ఏఈ కొండయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పామూరుకు టీటీడీ కల్యాణ మండపం మంజూరు

పామూరు: పామూరుకు టీటీడీ కల్యాణమండపం మంజూరైనట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, సభ్యుడు పశుపులేటి రఘురాంలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు గతంలో పామూరుకు టీటీడీ కల్యాణ మండపం మంజూరు చేయించాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్‌ల ద్వారా వినతిపత్రం ఇప్పించగా వారి సహకారంతో రూ.2 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. కల్యాణ మండపం మంజూరుచేయించిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, హుసేన్‌రెడ్డి, యాదాల సాయిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పొగాకు కనిష్ట ధర రూ.177


వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కనిష్ట ధర రూ.177గా నమోదైంది. చింతలపాలెం, పంగులూరివారిపాలెం గ్రామాల రైతులు 900 బేళ్లను వేలానికి ఉంచగా 873 కొనుగోలయ్యాయి. 27 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.200, సరాసరి ధర రూ.199.52 పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

కందుకూరు డివిజన్

90102 24456

Office mail : sakshiongads@gmail.com